# అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు

# ఏడుకొండల వేంకటరమణుడొక్కడే

ప్రపంచంలో యెక్కడా లేని మహిమాన్విత తిరుమలలోనే ఉన్నది. స్వయంభువుడైన వేంకటేశునిలోనే ఉన్నది. ఆ దైవిక అందం, ఆనందం, స్మిత మందహాసం ఆయనలోనే ఉన్నాయ్. ఆయన దేవ గంధర్వ, సిద్ధ, మౌనముని గణాలకు కూడా దేవుడు, దేవుళ్ళకు కూడా ఆశ్రయం కల్పించిన పరబ్రహ్మం వేంకట పరబ్రహ్మం. ముస్లిముల దండయాత్రలకూ, దోపిడీలకూ భయపడిన అర్చకులు శ్రీరంగంలోని శ్రీరంగనాధుణ్ణి తెచ్చి కొంతకాలం తిరుమల దేవాలయంలో భద్రపరిచారు. అనన్తరం ముస్లిముల తాకిడి తగ్గిన తరువాత తిరిగి శ్రీరంగానికి ఆ విరాట్‌ను శ్రీరంగం తరలించారు. మనం మహద్వారం గుండా లోపలికి ప్రవేశించినప్పుడు ఎడమవైపునున్న మండపంలో రంగనాధ విగ్రహం ఉంచడం వల్లనే ఆ మండపాన్ని రంగనాధ మండపం అని ఈనాటికినీ అంటారు. రంగనాధ స్వామి శ్రీరంగం తరలివెళ్ళిన తరువాత ఆ రంగనాధ మండపంలోనే శ్రీవారికీ, దేవేరులకూ నిత్యకళ్యాణం జరుపుతూండేవారు. కల్యాణం చేయించే గృహస్థులు సంఖ్య పెరగడంతో ఇప్పుడు శ్రీవారి నిత్యకళ్యాణములను వేరేచోటికి తరలించారు.



## స్వామివారి గడ్డం కింద పచ్చకర్పూరం చూసారా?

మూలవిరాట్టు గడ్డం క్రింద పచ్చ కర్పూరంతో నిత్యం అలంకరిస్తారు. దీని వెనుక ఓ వృత్తాంతం ఉంది. స్వామి అలంకరణ కోసం పుష్పనందనవనాన్ని పెంచాలని రామానుజాచార్యులవారు తన శిష్యుడు అనంతాళ్వార్‌ను ఆదేశించారు. ఈ పనిలో అనంతాళ్వార్ సతీమణి కూడా పాలుపంచుకుంది. గర్భవతిగా ఉన్న ఆమె తవ్విన మట్టిని గంపలో తీసుకెళుతూ అలసి కింద పడిపోతుంది. దీన్ని గుర్తించిన శ్రీనివాసుడు బాలుని రూపంలో ఆమెకు సాయపడతారు. దైవకార్యంలో ఇతరులెవరూ జోక్యం చేసుకోకూడదంటూ ఆ బాలుడిని అనంతాళ్వార్ కొడతాడు. గడ్డంపై దెబ్బ తగలడంతో బాలుడు అదృశ్యమైపోతాడు. తర్వాత అనంతాళ్వార్ ఆలయానికి వెళ్లి స్వామిని దర్శించుకుంటాడు. గడ్డంపై నుండి రక్తం కారడం చూసిన అనంతాళ్వార్, ఆ బాలుడు శ్రీహరేనని గ్రహించి, రక్తం కారకుండా పచ్చ కర్పూరం పెడతాడు. అందుకే నేటికీ మూలవిరాట్ గడ్డం కింద పచ్చకర్పూరం పెడుతున్నారు. ఎవరు ఎన్ని ఆభరణాలు యిచ్చినా, తలనీలాలు యిచ్చినవారిని ప్రధానంగా అనుగ్రహించే దేవుడు వేంకటేశ్వరుడే. వేంకటనాథుడు అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడు. భారతదేశంలోని రాష్ట్రపతులు, ప్రధానమంత్రులూ, న్యాయాధీశులే కాకుండా దేశదేశాలనుంచీ సార్వభౌములు వచ్చి కూడా దర్శిస్తూంటారు.







## ఆయన విశ్వదేవుడు, వడ్డీకాసులవాడు. ఆపద మొక్కులవాడు. కలియుగదైవం

శ్రీవారిని నిత్యం 120 రకాల ఆభరణాలతో అలంకరిస్తారు. ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్ప స్వామివారికి మరో 382 రకాల ఆభరణాలను వినియోగిస్తున్నారు. రోజువారీ అలంకారాన్ని నిత్యకట్ల అలంకారమనీ, పండుగలు, ఉత్సవాల్లో చేసే అలంకారాన్ని విశేష అలంకారమనీ అంటారు. మూలమూర్తి, ఉత్సవమూర్తి అలంకరణలకు వినియోగించే కిరీటాలు, ఆభరణాలు, ఇతర బంగారు సామగ్రి సుమారు 11 టన్నులు. భక్తులు సమర్పించే కానుకల్ని నమోదు చేసేందుకు టీటీడీ 19 తిరువాభరణ రిజిస్టర్లు నిర్వహిస్తోంది.

## స్వామివారికి ఆభరణాలు 11 టన్నుల బంగారం

వజ్రకిరీటం, రత్నకిరీటం, వజ్రాల శంఖుచక్రాలు, రత్నాల శంఖుచక్రాలు, రత్నాల కర్ణపత్రాలు, రత్నాల వైకుంఠ హస్తం, రత్నాల కటిహస్తం, రత్నాల మకరకంఠి, సువర్ణ పద్మపీఠం, సువర్ణ పాదాలు, నూపురములు, పగడాలు, కాంచీగునము, అంకెలు, వడ్డాణాలు, ఉదరబంధం, దశావతార హారం, చిన్న కంఠాభరణం, బంగారు పులిగోరు హారం, గోపు హారం, సువర్ణ యజ్ఞోపవీతం, తులసీ పత్రహారం, చతుర్భుజ లక్ష్మీహారం, అష్టోత్తర శతనామ హారం, సహస్ర నామహారం, సూర్య కఠారి, కడియాలు, కరభూషణములు, భుజదండ భూషణములు, నాగాభరణములు, భుజకీర్తులు, ఆకాశరాజు కిరీటం, సాలిగ్రామ హారం, తిరుక్కాళం, వజ్ర అశ్వత్థపత్ర హారం, ముఖపట్టీ, ఐదు పేటల కంఠి, చంద్రవంక కంఠి.







* వేంకటేశ్వరస్వామికి ఏటా సుమారు 800 కిలోల బంగారం వస్తోంది. ఒక్క 2005 నవంబర్‌లోనే కోటిరూపాయల విలువైన వజ్రాలనూ 110 కిలోల బంగారాన్నీ స్వామికి భక్తులు సమర్పించారు.
* స్వామివారికి అలంకరించే ప్రతి ఆభరణానికీ రెండో సెట్ ఉంటుంది. ఏదైనా కారణాల వల్ల మూల విరాట్టుకి వాడే అభరణాలు విరిగినట్లైతే రెండో సెట్‌ను ఉపయోగిస్తారు.
* వందల సంవత్సరాల నుంచి నేటి వరకూ స్వామి వారికి అందిన అభరణాల వివరాల రికార్డులను 'బొక్కసం సెల్' విభాగం నిర్వహిస్తుంది.
* రోజుకు 60 నుంచి 75 వేల మంది శ్రీనివాసుడి దర్శనం చేసుకుంటారు.
* మహాలఘు దర్శనం అమల్లో ఉన్న రోజైతే ఆ సంఖ్య 70 వేలకు చేరుకుంటుంది.
* స్వామి వారి ప్రసాదాల్లో ప్రారంభంలో లడ్డుకి స్థానం లేదు. తీపి బూందినే యిచ్చేవారు.

